# అభివృద్ధి జరగాలంటే నాగజ్యోతిని గెలిపించండి



ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పక్కన అభ్యర్థి బడే నాగజ్యోతి, మంత్రి సత్యవతి రాథోడ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు

- ములుగులో వందశాతం గెలుపు బీఆర్ఎస్‌దే..
- కమలాపురం బిల్టు ఫ్యాక్టరీని తెరిపిస్తాం
- ఏటూరునాగారంలో బస్‌డిపో ఏర్పాటు చేస్తాం
- ముల్లకట్ట నుంచి అకినేపల్లి మల్లారం వరకు గోదావరి కరకట్ట
- ఏటూరునాగారం రోడ్డు షోలో మంత్రి కేటీఆర్

ములుగు, ఏటూరునాగారం, నవంబర్ 27 : రాష్ట్రంలో రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసేది కేసీఆర్ అని, ములుగు ప్రాంతం అభివృద్ధి చెందాలంటే బడే నాగజ్యోతిని భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన రోడ్‌షోకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ములుగు నియోజకవర్గ ప్రజలు గత ఎన్నికల్లో చేసిన తప్పు మళ్లీ చేయొద్దని, ఆనాడు అభ్యర్థి ఓడినప్పటికీ ఇచ్చిన మాట ప్రకారం ములుగును జిల్లాగా ఏర్పాటు చేసి అభివృద్ధి చేశామన్నారు. నియోజకవర్గ పెండింగ్ సమస్యలను నాగజ్యోతి తన దృష్టికి తీసుకొచ్చారని, ఆమెను గెలిపిస్తే వాటన్నింటినీ తప్పనిసరిగా పరిష్కరిస్తామన్నారు. మంగపేట మండలం కమలాపురంలో మూతపడిన బిల్టు ఫ్యాక్టరీని తెరిపించే పూచి తనదేనని హామీ ఇచ్చారు. ఏటూరునాగారంలో తప్పకుండా బస్‌డిపో ఏర్పాటు చేస్తామని తెలిపారు. ముల్లకట్ట నుంచి అకినేపల్లి మల్లారం వరకు గోదావరి కరకట్ట, యువత కోసం స్పోర్ట్స్ కాంప్లెక్స్ సైతం నిర్మిస్తామన్నారు. కొండాయి గ్రామానికి రోడ్డు, బ్రిడ్జి నిర్మిస్తామని, గోదావరి ముంపు ప్రాంత వాసులకు మోడల్ కాలనీలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మ్యానిఫెస్టోలో పేర్కొన్న పథకాలన్నింటినీ అమలు చేస్తామన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ గ్యాస్ సిలిండర్ల ధరలు పెంచి పిరమైన ప్రధానిగా చరిత్రకు ఎక్కారన్నారు. రాష్ట్రంలోని ప్రజలందరికీ రేషన్ షాపుల ద్వారా ప్రతి నెలా సన్న బియ్యం అందిస్తామన్నారు. 50 ఏండ్లు పరిపాలించిన కాంగ్రెస్ ఆసరా పింఛన్లు రూ. 200లకు పరిమితం చేస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం నెలకు రూ.2వేలు ఇస్తున్నదని గుర్తు చేశారు. అధికారంలోకి రాగానే దానిని రూ.5వేలకు పెంచుతామన్నారు. జనవరిలో కొత్త రేషన్‌కార్డులు, కొత్త పింఛన్లు ఇప్పించే బాధ్యత తనదేన్నారు. పోడు భూముల సమస్యలు పరిష్కరించి ఎమ్మెల్యే సీతక్క తల్లిదండ్రులకు సైతం పట్టాలిచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. రేవంత్‌రెడ్డి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం వల్లే రైతుబంధు ఆగిందని, పదకొండు సార్లు రైతు బంధు ఇచ్చినట్టే మూడో తేదీన రైతులందరికీ 12వ దఫా రైతు బంధు డబ్బులు జమ చేస్తామన్నారు. మార్పు కావాలంటున్న కాంగ్రెస్ నాయకులు ఏం మార్పు కావాలో వారికి అర్థం కావడం లేదన్నారు. వారు అధికారంలో ఉన్నప్పుడు ఆర్నెళ్లకో ముఖ్యమంత్రిని మార్చే మార్పు కావాలా అని ప్రశ్నించారు. నల్లధనాన్ని వెలికితీసి ప్రతి ఒక్కరి బ్యాంకు ఖాతాలో రూ.15లక్షలు వేస్తామని చెప్పిన మోదీ ఉప్పు, పప్పుల ధరలు పెంచి మోసం చేశాడన్నారు. నాగజ్యోతిని గెలిపిస్తే సీఎం కేసీఆర్ కూడా ములుగులో రెండు రోజులు ఉండి అన్ని సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారన్నారు. మీరు గెలిపించాల్సింది ఇన్‌స్టాగ్రామ్ ఎమ్మెల్యేను కాదని ప్రజల్లో ఉండి మీకు సేవ చేసే వారిని అని గుర్తు చేశారు.



ములుగు రోడ్‌షోకు భారీగా తరలివచ్చిన ప్రజలు

### కాంగ్రెస్ దరిద్రాన్ని మళ్లీ తెచ్చుకుందామా ?

50 ఏండ్లు పరిపాలించిన దిక్కు మాలిన కాంగ్రెస్‌తో రాష్ట్రం అభివృద్ధి చెందకపోవడం వల్లే తెలంగాణ తెచ్చుకున్నామని మంత్రి కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ దరిద్రాన్ని మళ్లీ నెత్తిన పెట్టుకుందామా అంటూ ప్రశ్నించారు. మూడు గంటలు కరెంటు ఇస్తే సరిపోతుందని రేవంత్‌రెడ్డి అంటున్నారని మూడు గంటలు ఇస్తే సరిపోతుందా అన్నారు. 2014కు ముందు ములుగులో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ఆనాడు బస్ డిపో ఎందుకు ఏర్పాటు చేయలేక పోయారన్నారు. ఏటూరునాగారంలో ఆనాడు కరెంటు పరిస్థితి ఎలా ఉండేది.. ఇపుడేలా ఉండేదో మీకే తెలుసన్నారు. కాంగ్రెస్ పాలనలో పేలిపోయే మోటర్లు, కాలిపోయే స్టార్టర్లు, రాత్రి పూట కరెంటుతో రైతులు అవస్థలు పడ్డారన్నారు. పాములు కరిచి కరెంటు షాక్‌లతో ప్రాణాలు కోల్పోయారన్నారు. వ్యవసాయం గురించి తెలియక ఉత్తమ్ కుమార్‌రెడ్డి రైతు బంధు దండుగా అని, భట్టి విక్రమార్క పట్వారి వ్యవస్థను మళ్లీ తెద్దామంటున్నాడని, ధరణి తీసేసి భూమేత తెస్తామంటున్నారన్నారు. మళ్లీ ఊళ్లలో దళారులు, పట్వారీలు కావాలా అంటూ ప్రశ్నించారు. ఒక్క చాన్సు ఇవ్వండి అంటున్నారని, పదకొండు చాన్సులు ఇస్తే 55 ఏండ్లు రాష్ట్రంలో, దేశంలో అధికారం చెలాయించి ఏం ఒరగబెట్టారని నిలదీశారు. దిక్కుమాలిన ఇందిరమ్మ రాజ్యంలో ఆకలి కేకలు, గంజి కేంద్రాలు కొనసాగాయన్నారు. కేసీఆర్ పరిపాలనలో పేదలు, రైతులు, యువకులు సమస్త ప్రజానీకం ఆనందంగా ఉన్నారన్నారు. గతంలో ఓటు వేయకున్నా, ములుగును జిల్లా చేశాం కానీ, ఈసారి మాత్రం నాగజ్యోతిని గెలిపిస్తేనే అడిగినవన్నీ చేసి పెడుతామని కేటీఆర్ నవ్వుతూ అన్నారు. పనులన్నీ కావాలంటే కత్తి ఒకరికి ఇచ్చి యుద్ధం ఒకరిని చేయమంటే మంచిది కాదన్నారు. కత్తి నాగజ్యోతికి ఇవ్వాలి..యుద్ధం నాగజ్యోతి చేస్తుందని ప్రజలు అడిగిన ప్రతి పని చేసే బాధ్యత మాదేనని కేటీఆర్ స్పష్టం చేశారు. రోడ్డు షోలో మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనువాసరెడ్డి, రోడ్లు భవనాల కార్పొరేషన్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీ నర్సింహారావు, మండలాధ్యక్షుడు గడదాసు సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

**కొంగు చాచి ఓట్లు అడుగుతున్నా.. అవకాశం ఇవ్వండి**

*– బీఆర్ఎస్ ములుగు అభ్యర్థి బడే నాగజ్యోతి*

అందరి ఆడబిడ్డగా మీ ముందుకు వచ్చానని, కొంగు చాచి ఓట్లు అడుతున్నానని, ఒక్కసారి అవకాశం కల్పిస్తే ములుగు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని బీఆర్ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతి అన్నారు. ఈ ప్రాంతం అభివృద్ధి జరిగిందంటే కేవలం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనేనని చెప్పారు. ఏనాడు కూడా ములుగు ప్రాంత అభివృద్ధిని పట్టించుకోని కాంగ్రెస్ నాయకులు ఓటు వేయాలని అడుతున్నారని, వారి మాటలు నమ్మకుండా కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ప్రతి పక్ష పార్టీల ఎమ్మెల్యేలు మంత్రి కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల నియోజకవర్గం వలే అభివృద్ధి చేస్తామని అంటున్నారని, 50 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో వారు అభివృద్ధి చేసిన నమూనా నియోజకవర్గం ఒక్కటి కూడా లేదన్నారు. ములుగు సమస్యలు కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లానని, అవన్నీ కూడా పరిష్కారం అవుతాయన్నారు. ప్రభాకరన్న బిడ్డగా సాదుకున్నా, చంపుకున్నా ప్రజలేనని ఉద్వేగంతో మాట్లాడారు. ఇక్కడి ప్రజల కోసం సచ్చే దాకా కొట్లాడే సత్తా తనకుందని, ఊపిరి ఉన్నంత వరకు ప్రజా సేవకే అంకితం అవుతానని తెలిపారు.

---

# ప్రజల మద్దతు బీఆర్ఎస్‌కే..



పరకాల పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

- పరకాలను అభివృద్ధి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దే..
- తొమ్మిదేండ్లలో మారిన పరకాల రూపురేఖలు
- పగటి కలలు కంటున్న విపక్షాలు
- అభివృద్ధిని అడ్డుకుంటున్న ఆ పార్టీలకు ప్రజలే బుద్ధి చెబుతారు
- ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

పరకాల, నవంబర్ 27 : అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పాలన అందిస్తున్నారని, ప్రజల మద్దతు బీఆర్ఎస్‌కే ఉందని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో తొమ్మిదిన్నరేండ్లలో రూ.5వేల కోట్లతో పరకాల నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులను చేసుకున్నామని పేర్కొన్నారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు నిర్మాణం నియోజకవర్గానికే తలమానికమన్నారు. ఇందులో ప్రత్యక్షంగా లక్ష మందికి ఉద్యోగ అవకాశాలు, పరోక్షంగా మరెంతో మందికి ఉపాధి లభిస్తుందన్నారు. రెండు కొత్త మండలాలను ఏర్పాటు చేసి ప్రజలకు పాలన చేరువ చేశామని చెప్పారు. పరకాలను మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసుకుని, పట్టణంలో 100 పడకల దవాఖాన నిర్మిస్తున్నట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ చొరవతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే పరకాలను ముందంజలో నిలిపినట్లు పేర్కొన్నారు. ఇంటింటికి మిషన్ భగీరథ నీటిని అందించి ఏండ్లుగా నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదన్నారు. ఎస్ఆర్ఎస్పీ కాల్వల పునరుద్ధరణ, కోనాయిమాకుల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా అదనంగా సుమారు 50వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు. కాని విపక్ష నాయకులు అభివృద్ధిని అడ్డుకునే విధంగా వ్యవహరిస్తు అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. విపక్ష నాయకులు ప్రజలను దోచుకోవడానికే వస్తున్నారని, ఆ విషయాన్ని నియోజకవర్గ ప్రజలు గమనించాలన్నారు. దొంగలు దొంగలు జత కట్టి ప్రజలను మాయమాటలతో మోసం చేయాలని చూస్తున్నారన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి చేస్తున్న విమర్శలు అర్థరహితమని పేర్కొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి వెంటే దొంగలందరు ఉన్నారని, వారిని నమ్మి ఓటేస్తే నయవంచనకు గురవుతారని అన్నారు. 'వాళ్లు ఐదేండ్లకు ఓసారి వస్తుంటారు. తిరిగి పోతుంటారు. కాని గెలిచినా, ఓడినా పరకాల ప్రజల వెంబడి ఉండేది చల్లా ధర్మారెడ్డి మాత్రమే'నని అన్నారు. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలన్నారు. గతంలో పరకాలలో ఉన్న గూండాగిరి ప్రస్తుతం లేదని, పదేండ్లుగా ఈ ప్రాంతం ప్రశాంతంగా ఉందని, మళ్లీ విపక్షాలకు ఓటేస్తే రౌడీరాజ్యం మొదలవుతుందని హెచ్చరించారు. కర్ణాటక రాష్ట్రంలో అమలు కాని గ్యారెంటీలు తెలంగాణ రాష్ట్రంలో ఎట్లా అమలు చేస్తారని ప్రశ్నించారు. విపక్షాలకు చెందిన అభ్యర్థులు ఓడిపోతామని ముందుగానే ఊహించి మతిభ్రమించి అసహనంతో పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నారని విమర్శించారు. డిసెంబర్ 3 తర్వాత కాంగ్రెస్, బీజేపీ పార్టీలు గల్లంతు కావడం ఖాయమని ఆయన తెలిపారు. పరకాల ప్రాంత ప్రజలు విజ్ఞులని, వారు మంచీ చెడు ఆలోచించి ఓటు వేస్తారని ఆయన అన్నారు. అభివృద్ధి చేసి బీఆర్ఎస్‌ను ఆదరించాలని, రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ సీఎం అయితేనే మరిన్ని సంక్షేమ పథకాలు అమలు అవుతాయని, ప్రజలంతా సంతోషంగా ఉంటారని పేర్కొన్నారు. ఈ నెల 30న జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని చల్లా ప్రజలను కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మడికొండ శ్రీనివాస్, బండి సారంగపాణి, సోదా రామకృష్ణ, రేవూరి జయపాల్ రెడ్డి, నిప్పాని సత్యనారాయణ, నల్లెల్ల లింగమూర్తి, గుండెబోయిన నాగయ్య, చందుపట్ల తిరుపతి రెడ్డి, మడికొండ సంపత్‌కుమార్, ఏకు రాజు, పసుల రమేశ్, దగ్గు విజేందర్ రావు, పాలకుర్తి గోపి, అడప రాము, పావుశెట్టి వెంకటేశ్వర్లు, మార్క రఘుపతి, బండి సదానందం, పాడి భగవాన్‌రెడ్డి, దామె మొగిలి, చందుపట్ల రమణారెడ్డి, శనిగరపు నవీన్, పలువురు నాయకులు పాల్గొన్నారు.